సాక్షి అనంతపురం

శుక్రవారం ౹ 31 ౹ మార్చి ౹ 2023



టన్ను చీనీ రూ.31 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.31 వేలు పలికాయి.



కిలో టమాట రూ.14

కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.14, కనిష్టం రూ.3, సరాసరిన రూ.6.50 ప్రకారం పలికినట్లు అధికారులు తెలిపారు.

గరిష్టం/కనిష్టం

39.8°/21.6°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఎండలు పెరగడంతో ఉక్కపోత కొనసాగుతోంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది.







అనంతపురంలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు, కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం



అనంతపురం నగరంలోని సున్నపుగేరులో ఉట్లోత్సవం తిలకిస్తున్న జనం

జై శ్రీరాం..

శ్రీరామనవమి వేడుకలు జిల్లా వ్యాప్తంగా గురువారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆలయాలకు భక్తజనం పోటెత్తారు. సీతారాముల కల్యాణోత్సవాలు కమనీయంగా సాగాయి. రాములోరి పరిణయోత్సవాన్ని కనులారా తిలకించిన జనం పరవశించిపోయారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని పలు చోట్ల ఉట్లోత్సవాలు ఉత్సాహంగా సాగాయి. అనంతపురంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో భారీ సంఖ్యలో పాల్గొన్న భక్తులు జై శ్రీరాం నామాన్ని మార్మోగించారు. - సాక్షి నెట్‌వర్క్

న్యూస్‌రీల్

పలు రైళ్లకు అదనపు బోగీలు

- మరికొన్ని పొడిగింపు



గుంతకల్లు: వేసవి సెలవుల్లో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు బోగీలు ఏర్పాటు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ ఓ ప్రకటనలో తెలిపారు. పూరి - యశ్వంత్‌పూర్ (22883/84) ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఏసీ–3 టైర్ బోగీని అదనంగా ఏర్పాటు చేశామన్నారు. బెళగావి - సికింద్రాబాద్ (07335/36) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను జూలై 31 వరకు పొడిగిస్తున్నట్లు పేర్కొన్నారు. శివమొగ్గ – చెన్నై సెంట్రల్ (06223/24) ఎక్స్‌ప్రెస్ రైళ్లను జూన్ 28 వరకు పొడిగిసున్నట్లు వివరించారు.

మహిళపై చిరుతపిల్లల దాడి



గాయపడిన మహిళ

రాప్తాడు: చిరుతపిల్లల దాడిలో మహిళ గాయపడిన ఘటన మండలంలోని ఎం.చెర్లోపల్లిలో చోటుచేసుకుంది. గురువారం ఉదయం గ్రామంలోకి రెండు చిరుత పిల్లలు ప్రవేశించి స్థానికులను భయభ్రాంతులకు గురిచేశాయి. సుబ్బలక్ష్మి అనే మహిళ తలపై కరిచాయి. గ్రామస్తులు కేకలు వేయడంతో చెరువు వైపు పరుగులు తీశాయి. అటవీశాఖ అధికారులు ఆ పరిసరాలను జల్లెడ పట్టారు. మళ్లీ చిరుతలు కనబడితే సమాచారం ఇవ్వాలని కోరారు.

అర్హులనే ఆశాలుగా నియమించాలి

అనంతపురం సప్తగిరి సర్కిల్: అర్హులనే ఆశా కార్యకర్తలుగా నియమించాలని డీఎంహెచ్‌ఓ వీరబ్బాయి ఆదేశించారు. స్థానిక తన కార్యాలయం నుంచి వైద్యాధికారులతో గురువారం సెల్‌కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆశాల నియామకాల్లో అవకతవకలు జరుగుతున్నాయని తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఆశాల నియామకాల్లో పూర్తి పారదర్శకత పాటించాలని ఆదేశించారు.

మొబైల్.. గుభేల్

సాఫీగా సాగుతున్న కుటుంబ బడ్జెట్‌లో ఒకరకంగా ఇదొక కుదుపే. తెలియని ఖర్చు తెరచి చూస్తే కొండలా అవుతోంది. నిత్యావసరాలు, దుస్తులు, పిల్లల చదువులు వంటివి ఒకటికి రెండుసార్లు ఆలోచించి పెట్టుబడి పెట్టే సామాన్యులు.. మొబైల్ ఫోన్ వాడకం వచ్చే సరికి ఉదారంగా చెల్లిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. సెల్‌ఫోన్ చేతిలో ఉందికదా అని అవసరానికి మించి మాట్లాడటం, నెలవారీ రీచార్జ్‌ల వ్యయం భారీగా పెరగడంతో కుటుంబ బడ్జెట్ కుదుపులకు లోనవుతున్నట్టు నిపుణులు అంచనా వేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 42 లక్షల జనాభాకు గాను ఏడాదికి రూ.432 కోట్లు చెల్లిస్తున్నారు.



- తెలీకుండా వ్యయం.. తెరచి చూస్తే భయం
- సాధారణ కుటుంబాల్లోనూ పెరుగుతున్న సెల్‌ఫోన్ రీఛార్జీలు
- వాట్సాప్, ఫేస్‌బుక్ కోసం విచ్చలవిడి ఇంటర్నెట్ వినియోగం
- వాట్సాప్ వాడుతుంటే కనిష్టంగా నెలకు రూ.200 చెల్లింపులు
- ఉమ్మడి జిల్లాలో సగటున ఏడాదికి రూ.432 కోట్లు రీచార్జ్‌లకే
- మొబైల్ ఫోన్ల కొనుగోలు, నిర్వహణకు మరికొంత వ్యయం

సాక్షి ప్రతినిధి, అనంతపురం:

ఉమ్మడి జిల్లాలో సుమారు 14 లక్షల మందికి స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి. వీరిలో దాదాపుగా అందరూ ఇంటర్నెట్ వినియోగిస్తున్నవారే. కొన్నేళ్లుగా వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలకు అలవాటు పడి అవసరం లేకున్నా ఇంటర్నెట్ వాడుతున్నారు. దీనివల్ల తమకు తెలియకుండానే నెలవారీ రీచార్జ్ కనిష్టంగా రూ.200 నుంచి రూ.300 వరకూ చెల్లించాల్సి వస్తోంది. కుటుంబంలో నలుగురుంటే నాలుగు స్మార్ట్ ఫోన్‌లు ఉన్న కుటుంబాలు బోలెడున్నాయి.

పెరుగుతున్న నిర్వహణ వ్యయం : సెల్‌ఫోన్‌లో మాట్లాడటం ఎంత బావుంటుందో.. నిర్వహణ వ్యయం కన్నీళ్లు తెప్పిస్తోంది. ఇంట్లో మూడు స్మార్ట్ ఫోన్‌లు ఉంటే.. ఏడాదిలో ఒక్కటైనా కొత్త ఫోన్ లేదా, డిస్‌ప్లే వేయించుకునే పరిస్థితి. ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ 4జీబీ ర్యామ్‌కు కనిష్టంగా రూ.12వేలు పెట్టాల్సి వస్తోంది. ఒక్కసారి ఫోన్ డిస్‌ప్లే పగిలిపోతే రూ.2500 నుంచి రూ.4వేలు చెల్లించాల్సి ఉంది. ఇలా చార్జర్లు, అడాప్టర్లు, బ్లూటూత్‌లు రకరకాల కొనుగోళ్లు అంటూ అదనంగా వ్యయం అవుతోంది. ఇలా కోట్లాది రూపాయలు సెల్‌ఫోన్ చార్జీలు, నిర్వహణకు వెచ్చిస్తున్నారు.

రీచార్జ్ వ్యయం తప్పదు



నేను కార్పెంటర్ వృత్తిలో ఉన్నా. మా ఇంట్లో మూడు స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి. వీటికి నెలకు రూ.300 చొప్పున రూ.900 కచ్చితంగా రీచార్జ్ చేయాల్సిందే. వృత్తి పరంగా కూడా అన్నీ వాట్సాప్‌లో చూసుకోవాల్సిందే.

– అజయ్‌కుమార్, అమరాపురం

నలుగురికీ స్మార్ట్‌ఫోన్‌లే



నేను హెయిర్ సెలూన్‌లో పనిచేస్తా. నా భార్య, కూతురు, కొడుకు కలిపి నాలుగు ఫోన్‌లు ఉన్నాయి. సగటున మూణ్నెళ్లకు ఒకసారి ఒక్కో ఫోన్‌కు రూ.600పైగా అవుతుంది. మొత్తం రూ.2,500 విధిగా రీచార్జ్ చేయాల్సిందే.

–వెంకటేష్, బత్తలపల్లి

వాట్సాప్ జీవితంలో భాగమైంది



మా ఇంట్లో నలుగురు ఉంటే నలుగురికీ వాట్సాప్‌ఉండాల్సిందే. లేదంటే ఒక్కరోజు కూడా గడవదు. ఇంట్లో ఇంకొక వ్యయం తగ్గించుకునైనా రీచార్జ్‌కు పెట్టాల్సిందే. నాలుగు ఫోన్‌లకు కలిపి నెలకు రూ.800 పైనే అవుతుంది.

–శ్రీకాంత్‌రెడ్డి, జలాలపురం, శింగనమల

ఉమ్మడి అనంతపురం జిల్లాలో స్మార్ట్‌ఫోన్‌లు	14 లక్షలు
సగటున ఒక్కో వినియోగదారుడు నెలకు చెల్లింపు	రూ.200
నెలకు వినియోగదారుల చెల్లించే సొమ్ము	రూ.28 కోట్లు
ఏడాదికి చెల్లిస్తున్నది	రూ.336 కోట్లు
జిల్లాలో కీప్యాడ్ ఫోన్‌లు	8 లక్షల వరకూ
నెలకు చెల్లిస్తున్న సొమ్ము	రూ.8 కోట్లు
ఏడాదికి చెల్లిస్తున్న సొమ్ము	రూ.96 కోట్లు

వివిధ మొబైల్ టారిఫ్‌లు

సర్వీస్ ప్రొవైడర్	రోజులు	ప్యాకేజీ (కనిష్టంగా)
జియో	28	రూ.209 ఇంటర్నెట్‌తో
జియో	28	రూ.79 కీప్యాడ్ ఫోన్
ఎయిర్‌టెల్	28	రూ.239 ఇంటర్నెట్‌తో
ఎయిర్‌టెల్	28	రూ.155 ఇంటర్నెట్ లేకుండా
బీఎస్ఎన్ఎల్	24	రూ.99 కీప్యాడ్ ఫోన్
బీఎస్ఎన్ఎల్	24	రూ.155 ఇంటర్నెట్‌తో
వొడా	28	రూ.150 ఇంటర్నెట్ లేకుండా
వొడా	28	రూ.239 ఇంటర్నెట్‌తో

(5జీ అందుబాటులోకి వచ్చాక టారిఫ్ రేట్లు పెరగనున్నాయి)

బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్

- 37 ఖాళీలకు కలెక్టర్ ఉత్తర్వులు

అనంతపురం అర్బన్: విభిన్న ప్రతిభావంతులకు కేటాయించిన బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. జిల్లాలో డీఎస్సీ ద్వారా మూడు పోస్టులకు సంబంధించి 8 ఖాళీలు, ఓడీఎస్సీ ద్వారా 16 పోస్టులకు సంబంధించి 29 ఖాళీలు భర్తీ చేయనున్నారు. ఈ మేరకు నోటిఫికేషన్‌ను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఈనెల 28న జారీ చేశారు. అర్హులైన అభ్యర్థుల నుంచి ఏప్రిల్ 15 లోగా దరఖాస్తులు స్వీకరిస్తారు. దరఖాస్తు, అర్హతలు, ఇతర వివరాలను http://ananthapuramu.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచారు. మరిన్ని వివరాల కోసం సహాయ సంచాలకులు, విభిన్న ప్రతిభావంతుల శాఖ, అనంతపురం ఫోన్ నంబర్ 08554-232380 ద్వారా సంప్రదించాలని పేర్కొన్నారు.

ఖాళీల భర్తీ ఇలా...

- డీఎస్సీ ద్వారా... జూనియర్ అసిస్టెంట్ పోస్టులు 5 ఖాళీలు, జూనియర్ అసిస్టెంట్ కమ్ టైపిస్టు పోస్టు ఒకటి, టైపిస్ట్ పోస్టు ఒకటి ఎల్‌డీ కంప్యూటర్ పోస్టు ఒకటి మొత్తం 8 పోస్టులు భర్తీ చేయనున్నారు.
- ఓడీఎస్సీ ద్వారా... మల్టీపర్పస్‌హెల్త్ అసిస్టెంట్ 2, ల్యాబ్ టెక్నీషియన్ 1, ఆఫీస్ సబార్డినేట్ 5, టెక్నికల్ అసిస్టెంట్ 1, దోబీ 1, స్వీపర్ 1, పబ్లిక్ హెల్త్ వర్కర్ 7, వాచ్‌మ్యాన్ 1, కుక్ 2, వాటర్ కారియర్ 1, నాన్‌పీహెచ్ వర్కర్ 2, ఫిట్టర్ కూలీ 1, చైన్‌మ్యాన్ 1, ఆయా1, లస్కర్ 1, గ్యాంగ్ మజ్దూర్ 1 మొత్తం 29 ఖాళీలు భర్తీ కానున్నాయి.

దళితులను ఇబ్బంది పెడితే సహించం

- బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

నార్పల: దళితులను ఇబ్బందులకు గురిచేసే వారు ఎవరైనా సహించే ప్రసక్తే లేదని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా దళితుల సంక్షేమానికి, రక్షణకు పాటుపడుతోందన్నారు. అందువల్లే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు తక్షణ న్యాయం జరిగేలా చూస్తోందన్నారు. గురువారం ఆయన అనంతపురం జిల్లాలో పర్యటించారు. ఇటీవల దారుణ హత్యకు గురైన నార్పల మండలం బొందలవాడకు చెందిన రమాదేవి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ, దళిత యువతిని బుక్కరాయసముద్రం చెరువులో తోసేసి హతమార్చడం తనను ఎంతో బాధించిందన్నారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. నిందితుడికి కఠిన శిక్షపడేలా చూస్తామన్నారు. అట్రాసిటీ చట్టం మేరకు బాధిత కుటుంబానికి నివాస స్థలం, సాగుకు పనికి వచ్చే వ్యవసాయ భూమి, పరిహారం వెంటనే కేటాయించాలని ఆర్డీఓ మధుసూదన్‌కు సూచించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ కేసులను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ శ్రీనివాసులను సూచించారు. ఆయన వెంట ఎమ్మార్పీఎస్ నేత సువర్ణరాజు, ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, పుల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాల పరిటాల

- సునీత మంత్రిగా ఉన్న సమయంలో రూరల్ మండలంలో దోపిడీ
- రూ. కోట్లు విలువ చేసే భూములను ఫేక్ పట్టాలతో కొట్టేశారు
- అక్రమార్కుల చేతుల్లో ఉన్న ప్రతి ఎకరా వెనక్కు తీసుకుంటాం
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి స్పష్టీకరణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: 'పరిటాల సునీత మంత్రిగా ఉన్న సమయంలో అనంతపురం రూరల్ మండలంలో రూ. కోట్లు విలువ చేసే భూములను ఫేక్ పట్టాలతో కొట్టేశారు. టీడీపీ నాయకులు, రెవెన్యూ అధికారులు వాటాలు పంచుకున్నారు. అక్రమార్కుల చేతుల్లో ఉన్న ప్రతి ఎకరా వెనక్కు తీసుకుని తీరతాం' అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం అనంతపురం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొడిమి జగనన్నకాలనీ, కురుగుంట వైఎస్సార్ కాలనీ, ఉప్పరపల్లి, సోములదొడ్డి ప్రాంతాల్లో విలువైన భూములు కబ్జాకు గురయ్యాయన్నారు. టీడీపీ హయాంలో పాత రికార్డులు స్వాధీనం చేసుకుని ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడ ల్యాండ్ అసైన్డ్ ఫర్ ఎక్స్ మిల్ట్రీ అని ఎంట్రీ చేశారని ఆరోపించారు. అందుకే 2012 నుంచి ఆన్‌లైన్ విధానం వచ్చినప్పుడు వెబ్ ల్యాండ్‌లో ఈ ఫేక్ మిల్ట్రీ పట్టాల వివరాలు కనిపించలేదన్నారు. 2014 నుంచి 2018 వరకు టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో మాత్రమే ఆన్‌లైన్ చేశారన్నారు. అప్పటి మంత్రి, నాయకులు, రెవెన్యూ అధికారులు వాటాలు పంచుకున్నారని ఆరోపించారు. దాదాపు రూ. 200 కోట్ల విలువైన భూములను నకిలీ డాక్యుమెంట్లతో కబ్జా చేశారని, ఈ స్కామ్‌లన్నీ సునీత మంత్రిగా ఉన్న సమయంలోనే జరిగాయన్నారు. ఫేక్ పట్టాలన్నీ రద్దు చేసి భూములు స్వాధీనం చేసుకునేందుకు పోరాడతామన్నారు. కొడిమి పొలంలో మూడు రోజుల క్రితం జరిగిన కబ్జాను రెవెన్యూ అధికారులు పోలీసుల సహకారంతో అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు. డీసీ శ్రీనివాసులు అనే వ్యక్తి రైతుకూలీ అని మూడేళ్లుగా భూమిని సాగుచేసుకుంటున్నాడంటూ 1996లో రికార్డుల్లో ఉందన్నారు. దీన్ని హైదరాబాద్ మల్కాజ్‌గిరిలో ఉన్న బీసీ శ్రీనివాసులుగా పేరు మార్చారన్నారు. ఆయనకు 1996లో పట్టా ఇచ్చినట్టు డీఫారం తయారు చేసి అసైన్డ్ చేశారన్నారు. ఆయన మిల్ట్రీ అని ఎక్కడా కనబరచలేదన్నారు. ఈ భూమిని 2014లో మహేంద్రరెడ్డి అనే వ్యక్తి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని, కంతా శ్రీనివాసులు అనే వ్యక్తి కబ్జాదారుడన్నారు.అతను సాక్షిగా సంతకం చేశాడని, ఒక దొంగ సాక్షి సంతకం చేస్తే మరో దొంగ రిజిస్టర్ చేశాడని మండిపడ్డారు. కొడిమి గుట్ట కింద 40 ఎకరాల భూములను అధికారులు స్వాధీనం చేసుకున్నారన్నారు.

పేదల పక్షాన పోరాడతాం..

ఓ విలేకరికి కొడిమి పొలం 149–2 సర్వే నంబరులో 4.34 ఎకరాలు, మరో విలేకరికి 149–3లో 3.02 ఎకరాల భూమి ఉందని ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి తెలిపారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, స్థానిక నాయకులకు కమీషన్లు ఇచ్చేసి ఫేక్ డాక్యుమెంట్లు తయారు చేసుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించుకుని పేదల ఇళ్ల పట్టాల కోసం తాము ప్రయత్నిస్తుంటే కొన్ని పత్రికలు, ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. పేదలకు మేలు జరిగే విషయంలో ఎంత బురద జల్లినా పట్టించుకోమని, వారి పక్షాన పోరాడతామని స్పష్టం చేశారు.

తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఒక్కడే లోకల్..

రాప్తాడుకు చాలామంది వస్తుంటారు..పోతుంటారు... తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఒక్కడే లోకల్ అన్నారు. లోకేష్ పాదయాత్ర ఆయారాం...గయారాంలా ఉంటుందన్నారు. జాకీ బాధితులతో మీటింగ్ పెట్టుకుంటాడని తెలిసిందని, బహుశా పేజ్ ఇండస్ట్రీస్, షాపూర్జీ పల్లోంజీ, పరిటాల సునీత, శ్రీరామ్ ఈ దొంగల ముఠా కలిసి చర్చించుకుంటారేమోనని ఎద్దేవా చేశారు.

మేమెళ్లిపోతున్నాం..సంతోషంగా ఉండు!

- కుటుంబ తగాదాలతో ఓ వ్యక్తి కఠిన నిర్ణయం
- ఇద్దరు బిడ్డలతో కలిసి చెరువులో దూకి ఆత్మహత్య
- భార్య ప్రవర్తనపై లేఖ రాసి జేబులో ఉంచుకున్న అభాగ్యుడు



మృతి చెందిన రఫీ, ఇమ్రాన్, సోహైల్(ఫైల్)



చెరువులోంచి వెలికి తీసిన మూడు మృతదేహాలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ప్రేమ పెళ్లి..పదేళ్ల దాంపత్యం..ముత్యాల్లాంటి ఇద్దరి పిల్లలు. ఆ దంపతుల మధ్య ఏమైందో తెలియదు... ఎవరొచ్చారో తెలియదు. అతను తట్టుకోలేక పోయాడు. కఠిన నిర్ణయం తీసుకున్నాడు. బిడ్డలతో కలిసి బుక్కరాయసముద్రం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ''మేమెళ్లిపోతున్నాం.. నువ్వు సంతోషంగా ఉండు''అని భార్యనుద్దేశించి భర్త రాసిన లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ విషాదకర సంఘటన గురువారం అనంతపురంలో చోటుచేసుకుంది. అనంతపురం మూడో పట్టణ సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు... నగరంలోని రంగస్వామి నగర్‌కు చెందిన బోరింగ్ బాషా కుమారుడు మహమ్మద్ రఫీ (36), తన నివాసం సమీపంలో ఉంటున్న ఖైరాన్ కుమార్తె భానును పదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇమ్రాన్(9), సోహైల్ (6) సంతానం. మహమ్మద్ రఫీ బేల్దారీగా పని చేసి కుటుంబాన్ని పోషించేవాడు. ఈ కుటుంబం ఎక్కువగా బెంగళూరులో ఉండేది. పండుగలు, పర్వదినాలకు మాత్రం అనంతపురం వచ్చేది. అందులో భాగంగానే 20 రోజుల క్రితం మహమ్మద్ రఫీ, భాను పిల్లలతో కలిసి అనంతపురం వచ్చారు. దంపతుల మధ్య ఘర్షణలు చోటుచేసుకోగా, నాలుగురోజుల క్రితం త్రీటౌన్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్నారు. పోలీసులు దంపతులిద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. మహమ్మద్ రఫీ మాత్రం తన మనసులోని బాధను మరచిపోలేకపోయాడు.పదేపదే తలుచుకుంటూ బాధనంతా భార్యపై చూపించాడు. దీంతో ఆమెకు ఫిట్స్ వచ్చాయి. ఈక్రమంలో భార్య తరఫు బంధువులు మహమ్మద్ రఫీని బెదిరించారు. తమ బిడ్డకు ఏమైనా అయితే నీదే బాధ్యత అన్నట్లుగా మాట్లాడారు. తప్పుచేసిన వారిని వదిలి తనపై ఎదురుదాడిని జీర్ణించుకోలేని మహమ్మద్ రఫీ తన ఇద్దరు కుమారులను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో భార్య భాను పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్న మూడో పట్టణ పోలీసులు వారి కోసం తీవ్రంగా గాలించినా ఫలితం లేకపోయింది. గురువారం ఉదయాన్నే బుక్కరాయసముద్రం చెరువులో మూడు మృతదేహాలున్నట్లు స్థానికుల సమాచారంతో పోలీసులు హుటాహుటిన చేరుకుని పరిశీలించారు. ఆ మృతదేహాలు అదృశ్యమైన మహమ్మద్ రఫీ, ఆయన కుమారులు ఇమ్రాన్, సోహైల్‌విగా గుర్తించారు. భార్య ప్రవర్తనతో జీవితంపై విరక్తి చెందిన మహమ్మద్ రఫీ బిడ్డలిద్దరినీ చెరువులో తోసి, ఆ తర్వాత తాను దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఆత్మహత్యకు కారణాలను వివరిస్తూ మహమ్మద్ రఫీ రాసిన సూసైడ్ లేఖను అతని జేబులోని ఓ బాటిల్‌లో ఉండగా స్వాధీనం చేసుకున్నారు. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలకు అనంతపురం సర్వజనాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

రంగస్వామి నగర్‌లో విషాదఛాయలు

ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి చెందడంతో రంగస్వామి నగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. ముక్కుపచ్చలారని చిన్నారుల మృతదేహాలను చూసి స్థానికులు చలించిపోయారు. ఏం కష్టమొచ్చిందయ్యా.. వారిని ఎలా బలి తీసుకున్నావంటూ రోదించిన తీరు చూపరులను కలచివేసింది. ఇంతటి కఠిన నిర్ణయం తీసుకోవడం వెనుక పసివాళ్లు చేసిన పాపమేందంటూ పలువురు పోలీసులు సైతం కంటతడి పెట్టుకున్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాలేజీ డేలో అల్లరి మూకలు

- జేఎన్‌టీయూ విద్యార్థిపై మూకుమ్మడి దాడి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్ కళాశాల 76వ వార్షికోత్సవం వేడుకల్లో ప్రైవేట్ అల్లరి మూకలు హల్‌చల్ చేశాయి. కళాశాల విద్యార్థిపై ఏకంగా పది మందికి పైగా మూకుమ్మడి దాడికి తెగబడ్డారు. ఘటనను కళాశాల అధ్యాపకుల దృష్టికి తీవ్రంగా గాయపడిన విద్యార్థి తీసుకెళ్లడంతో గురువారం ఉదయం అనంతపురం వన్‌టౌన్ పోలీసులకు కళాశాల ఉన్నతాధికారులు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ రవిశంకరరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కళాశాలతో సంబంధం లేని వ్యక్తులు లోపలకు ఎవరు వెళ్లారన్న దానిపై ఆరా తీస్తున్నారు. గాయపడిన విద్యార్థితో మాట్లాడారు. గొడవకు దారి తీసిన కారణాలను ఆరా తీశారు. విద్యార్థి కళ్లజోడును తీసుకున్న ప్రైవేట్ వ్యక్తి తిరిగి ఇవ్వకుండా తన స్నేహితులతో కలసి దాడికి దిగినట్లుగా తెలిసింది. ఆ సమయంలో దాడిని అడ్డుకునేందుకు ఎవరూ ముందుకు రాకుండా భయభ్రాంతులకు గురి చేసినట్లుగా తెలుస్తోంది.

ప్రశాంత గ్రామాల్లో చిచ్చు రేపొద్దు లోకేష్

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య
- పబ్లిసిటీ పిచ్చితో యువతను ఫ్యాక్షన్ వైపు ఉసిగొల్పితే చూస్తూ ఊరుకోబోమంటూ హెచ్చరిక



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

అనంతపురం క్రైం: ప్రశాంత గ్రామాల్లో చిచ్చు రేపి అధికారంలోకి రావాలనే ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోబోమని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య హెచ్చరించారు. తన పాదయాత్రలో ఫ్యాక్షన్ వైపు యువత ప్రభావితమయ్యేలా ప్రసంగాలు సాగిస్తున్న లోకేష్ తీరును ఆయన ఖండించారు. మరోసారి ఈ తరహా ప్రసంగాలు చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎలాంటి అజెండా లేకుండా చేపట్టిన పాదయాత్రలో యువతను ఆకట్టుకునేందుకు విద్వేషాలు చెలరేగేలా ప్రసంగాలు చేయడం అమానవీయ చర్య అని అన్నారు. తన తండ్రిలా రాముడిని కాదని, రాక్షసున్ని, మూర్ఖున్ని, ఫ్యాక్షనిస్టుని అంటూ లోకేష్ ప్రగల్భాలు పలుకుతూ టీడీపీ అధికారంలోకి వస్తే వైఎస్సార్ సీపీ నాయకులను చెడ్డీలతో ఊరేగిస్తామంటూ యువతను రెచ్చగొట్టి ప్రశాంత గ్రామాల్లో చిచ్చు రేపేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. పాదయాత్రకు జనం నుంచి స్పందన లేకపోవడంతో మీడియాను ఆకర్షించేందుకు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురవడంతో వాగులు, వంకలు, కుంటలు, చెరువులు నిండాయని, తద్వారా పాడి పంటలతో రైతులు ఆనందంగా ఉన్నారన్నారు. ఇలాంటి తరుణంలో విద్వేషాలకు తెరలేపి రాజకీయ లబ్ధి పొందాలనుకోడం దుర్మార్గమన్నారు. హైదరాబాద్‌ను కేరాఫ్ అడ్రస్‌గా చేసుకుని ఇక్కడ రాజకీయాలు చేయడం కాదని, అనంతపురం, తాడిపత్రి, ధర్మవరం ప్రాంతాలను ఆవాసంగా మార్చుకుని చూస్తే వాస్తవమేమిటో అర్థమవుతుందన్నారు. టీడీపీ హయాంలో అవినీతి రాజ్యమేలిందన్నారు. తాజాగా ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ నలుగురు ఎమ్మెల్యేలను సంతలో పశువుల్లా కొనుగోలు చేశారని గుర్తు చేశారు. అవినీతి అనేది చంద్రబాబు నరనరాల్లో ప్రవహిస్తోందన్నారు. చేతనైతే ఆ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి, ప్రజాక్షేత్రంలో మరోసారి పోటీకి సిద్ధమవ్వాలని సవాల్ విసిరారు. ఇప్పటికైనా జో(లో)కేష్ మాట తీరు మార్చుకోవాలని, లేకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ నాలుగేళ్లలో పార్టీ గుర్తుతో టీడీపీ గెలిచిన దాఖలాలు ఒక్కటి కూడా లేవన్నారు. రాబోవు ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీకే ప్రజలు పట్టం కట్టడం ఖాయమన్నారు.

బిల్లె శ్రీనివాస్ మృతికి సంతాపం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త బిల్లె శ్రీనివాస్ మృతిపై పైలా నరసింహయ్య సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సమావేశంలో కక్కలపల్లి సర్పంచ్ గాండ్ల కృష్ణయ్య, ఉప సర్పంచ్ బండి రమేష్, నాయకులు బయప్ప, శంకర్ రెడ్డి, యల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ మాఫీకి ఒక్కరోజే గడువు!


రాయదుర్గంలోని ఓ వార్డులో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రంలో పన్నులు చెల్లిస్తున్న దృశ్యం

జిల్లాలో గురువారం సాయంత్రం 7 గంటలకు వసూలైన పన్ను (రూ.కోట్లలో)

మున్సిపాలిటీ	డిమాండ్	వసూలు	శాతం
అనంతపురం	రూ.51.33	రూ.40.00	78
గుంతకల్లు	రూ.13.01	రూ.8.91	68
తాడిపత్రి	రూ.7.82	రూ.7.24	92
రాయదుర్గం	రూ.3.22	రూ.2.67	83
కళ్యాణదుర్గం	రూ.4.43	రూ.2.71	61
గుత్తి	రూ.4.05	రూ.2.89	71

రాయదుర్గం టౌన్: మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను చెల్లింపుపై ప్రభుత్వం కల్పించిన వెసులుబాటు ఆశించిన మేర ఫలితాలను రాబట్టింది. అసలు చెల్లిస్తే వడ్డీ పూర్తిగా మాఫీ చేస్తున్నట్లు జగన్‌సర్కార్ ప్రకటించడం తెలిసిందే. వడ్డీ రాయితీ గడువు శుక్రవారంతో ముగియనుంది. ఈ క్రమంలో పన్ను అసలు మొత్తాన్ని చెల్లించేందుకు యజమానులు మున్సిపాలిటీలకు బారులు తీరారు. శుక్రవారం అర్ధరాత్రిలోపు పాత, కొత్త బకాయిలు కలిపి చెల్లిస్తే వడ్డీ పూర్తిగా మాఫీ అవుతుంది. ఈ విధానంతో మున్సిపాలిటీలకు కొంత మేర నష్టం చేకూరుతున్నప్పటికీ.. చెల్లింపుదారులపై పెద్ద మొత్తంలోనే ఆర్థిక భారం తగ్గనుంది. గురువారం సాయంత్రం నాటికి 92 శాతం వసూళ్లతో తాడిపత్రి మున్సిపాలిటీ మొదటిస్థానంలో ఉండగా 83 శాతం వసూళ్లతో రాయదుర్గం రెండోస్థానంలో నిలిచింది.

ఇన్విజిలేటర్ల నియామకం పూర్తి

- ఉత్తర్వులు జారీ చేసిన డీఈఓ
- ప్రతి కేంద్రంలో కనీసం ఇద్దరు తక్కువ కాకుండా మహిళా ఇన్విజిలేటర్లు

రాప్తాడురూరల్: పదో తరగతి పరీక్షల ఏర్పాట్ల ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. అతి ముఖ్య ఘట్టమైన ఇన్విజిలేటర్ల నియామకం పూర్తయింది. మూడు రోజుల పాటు కసరత్తు చేసిన విద్యాశాఖ ఎట్టకేలకు పూర్తిచేసింది. గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ ఇన్విజిలేటర్ల జాబితాను పలుమార్లు పరిశీలించారు. ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్, సిబ్బందితో డీఈఓ సుదీర్ఘంగా చర్చించి జాబితాను ఫైనల్ చేశారు. ఎస్జీటీలకు సంబంధించిన జాబితాను మండల విద్యాశాఖ అధికారులకు పంపారు. స్కూల్ అసిస్టెంట్ల జాబితా పాఠశాల హెచ్‌ఎంలకు పంపారు. మరోవైపు ఇన్విజిలేటర్లగా నియమితులైన వారి మొబైల్ ఫోన్లకు విద్యాశాఖ నుంచి మెసేజ్‌లు పంపుతున్నారు. ఎస్జీటీలను ఎంఈఓలు, స్కూల్ అసిస్టెంట్లను ప్రధానోపాధ్యాయులు రిలీవ్ చేయనున్నారు.


ఇన్విజిలేటర్ల జాబితాను పరిశీలిస్తున్న డీఈఓ సాయిరామ్, చిత్రంలో ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్

1,978 మంది ఇన్విజిలేటర్లు

ఏప్రిల్ 3 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు సంబంధించి జిల్లాలో 139 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 139 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 139 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను నియమించారు. మొత్తం 1978 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. విద్యార్థులను తనిఖీలు చేయడంలో భాగంగా బాలికలను తనిఖీలు చేసేందుకు వీలుగా ప్రతి కేంద్రంలోనూ కనీసం ఇద్దరికి తగ్గకుండా మహిళా ఇన్విజిలేటర్లను నియమించారు. మొత్తం 327 మంది మహిళా ఇన్విజిలేటర్లను నియమించారు. కాగా 300 మంది విద్యార్థుల సంఖ్య దాటిన పరీక్ష కేంద్రాలకు అడిషనల్ డిపార్ట్‌మెంటల్ అధికారిని నియమించనున్నారు. జిల్లాలో దాదాపు 20 కేంద్రాలకు పైగా అడిషనల్ డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమిస్తున్నారు.

ఎవరికీ మినహాయింపు ఉండదు

పరీక్షల విధులకు నియమించిన వారిలో ఏ ఒక్కరికీ మినహాయింపు ఉండదు. ఏదైనా బలమైన కారణాలు ఉంటే తప్ప మినహాయింపు ఇవ్వం. పదేళ్ల పాటు చదివిన విద్యార్థులు తొలిసారి పబ్లిక్ పరీక్షలు రాస్తున్నారు. గురువులు పరీక్షల నిర్వహణ బాధ్యతగా తీసుకోవాలి తప్ప సాకులు చెప్పి తప్పించుకోకూడదు. ప్రతి ఒక్కరూ సహకరించాలి.
– ఎం. సాయిరామ్ డీఈఓ

బడుగులంటే మారుతీచౌదరికి గిట్టదు

- మంత్రి ఉషశ్రీచరణ్



కళ్యాణదుర్గం: ఎస్సీ, ఎస్టీ, బీసీలంటే టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి కుమారులు మారుతీచౌదరి, ఉదయ్‌చౌదరికు గిట్టదని మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆమె పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇటీవల శెట్టూరు మండలం లక్ష్మంపల్లిలో బీసీ వర్గానికి చెందిన వైస్ ఎంపీపీ లక్ష్మీదేవి కుటుంబ సభ్యులతో పాటు దళితుడైన విరుపాక్షిపై జరిగిన దాడిని ఆమె ఖండించారు. బడుగులపై దాడులకు పాల్పడం ఉన్నం మారుతికి పరిపాటిగా మారిందన్నారు. టీడీపీ హయాంలోనూ ఎక్సైజ్ సీఐ అన్నపూర్ణమ్మ, కన్సల్టెంట్ డీఈ రూపమ్మ... వారివారి ఉద్యోగ ధర్మాన్ని పాటిస్తే భయభ్రాంతులకు గురి చేసి దాడులు చేశారని గుర్తు చేశారు. తాజాగా బీసీ మహిళ అని కూడా చూడకుండా వైస్ ఎంపీపీ లక్ష్మీదేవి కుటుంబ సభ్యులు వడ్డే శారదమ్మ, దళితుడు విరుపాక్షిపై దాడికి తెగబడడం వారి నేర ప్రవృత్తికి నిదర్శనమన్నారు. సకాలంలో గ్రామస్తులు అడ్డుకోవడంతో వారు వెనుదిరిగారన్నారు. వడ్డే కులానికి చెందిన మహిళ వైస్ ఎంపీపీగా ఉండటాన్ని ఓర్వలేకే దాడికి తెగబడ్డారని మండిపడ్డారు. ఇప్పటికీ కేసు వెనక్కు తీసుకోవాలని విరుపాక్షికి టీడీపీ నాయకుల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని, ఎలాంటి పరిస్థితుల్లోనూ అధైర్య పడరాదన్నారు.

పెళ్లి సంబంధాలు కుదరక యువకుడి బలవన్మరణం

కుందుర్పి: పెళ్లి సంబంధాలు కుదరకపోవడంతో మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కుందుర్పి మండలం కరిగానిపల్లికి చెందిన గొల్ల నటరాజ్ (22)కు పెళ్లి చేసేందుకు కుటుంబసభ్యులు ప్రయత్నాలు చేపట్టారు. ఈ క్రమంలో పలు సంబంధాలు చూశారు. ఏ సంబంధమూ కుదరలేదు. దీంతో వయసు మీరిపోతే తనకు పిల్లనిచ్చేందుకు ఎవరూ ముందుకురారంటూ జీవితంపై విరక్తి పెంచుకున్న నటరాజ్... గురువారం తెల్లవారుజామున ఇంటి పక్కనే ఉన్న మరో గదిలోకి వెళ్లి దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ కృష్ణమూర్తి అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

వృద్ధురాలి హత్య కేసులో నిందితుల అరెస్ట్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: వృద్ధురాలిని హతమార్చిన కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాలను అనంతపురం నాల్గో పట్టణ సీఐ జాకీర్ హుస్సేన్ గురువారం వెల్లడించారు. అనంతపురంలోని ఆజాద్ నగర్‌లో నివాసముంటున్న బాషాకు 2018లో గుంతకల్లుకు చెందిన ఉమెరా సుల్తానాతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ఉమెరా సుల్తానా, అత్త సర్దార్‌బీ (57) మధ్య తరచూ ఘర్షణలు చోటు చేసుకునేవి. దీంతో అత్తను ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని నిశ్చయించుకుని గుంతకల్లులోని తన సోదరుడు వన్నూరువలితో కలసి పథకం రచించింది. బుధవారం రాత్రి మామ ఇస్మాయిల్, భర్త బాషా పనిపై బయటకు వెళ్లిన సమయంలో తమ్ముడు వన్నూరు వలిని ఇంటికి రప్పించుకుంది. అర్ధరాత్రి దాటిన తర్వాత సర్దార్‌బీ గొంతుకు వైర్ బిగించి హతమార్చారు. అనంతరం గుర్తు తెలియని వ్యక్తులు ఆమెను హతమార్చి బంగారు నగలు అపహరించుకెళ్లినట్లు ఉమెరా సుల్తానా నాటకానికి తెరలేపింది. ఆమె ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో అసలు విషయం తెలుగు చూసింది. దీంతో గురువారం సాయంత్రంరుద్రంపేట సమీపంలో వన్నూరు వలిని అదుపులోకి తీసుకున్నారు. ఓ ద్విచక్ర వాహనంతో పాటు రెండు సెల్‌ఫోన్లు, హత్యకు ఉపయోగించిన వైరు, బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాలతో రిమాండ్‌కు తరలించారు.

జెడ్పీ డిప్యూటీ సీఈఓకు డిప్యూటేషన్

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ జల్లా శ్రీనివాసులు డిప్యూటేషన్‌పై సైనిక సంక్షేమ శాఖకు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో శుక్రవారం ఆయన రిలీవ్ కానున్నట్లు తెలిసింది. 2020, సెప్టెంబర్ 6న డిప్యూటీ సీఈఓగా ఆయన బాధ్యతలు చేపట్టారు. రెండున్నరేళ్లకు పైబడి విజయవంతంగా విధులు నిర్వర్తించారు. కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులు, ఉద్యోగుల జీతాలు, సెలవులు మంజూరు వంటి పాలనాపరమైన అన్ని అంశాలూ డిప్యూటీ సీఈఓ పరిధిలోనే ఉంటాయి. ఈ క్రమంలో ఈ హోదాలో పనిచేసేందుకు పలువురు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇప్పటికే ఎనిమిది మంది జెడ్పీ డిప్యూటీ సీఈఓ రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో డీఎల్‌డీఓ హోదాలో పనిచేస్తున్న సూర్యనారాయణ(కదిరి), చిలంకూరు ఓబుళమ్మ(అనంతపురం), శంకర్(కళ్యాణదుర్గం), శివారెడ్డి(ధర్మవరం) ఉన్నారు. అలాగే ఉరవకొండ ఎంపీడీఓ అమృతరాజ్, బొమ్మనహాళ్ ఎంపీడీఓ షకీలా బేగం, హిందూపురం క్లస్టర్ డ్వామా ఏపీడీ శివానంద నాయక్, విజయవాడలోని సెర్ప్‌లో పనిచేస్తున్న లావణ్యకుమారి సైతం పోటీలో ఉన్నట్లు సమాచారం.

వివాహిత ఆత్మహత్య

- మనస్తాపంతో భర్త ఆత్మహత్యాయత్నం

శెట్టూరు: జీవితంపై విరక్తితో ఓ వివాహిత ఆత్మ హత్య చేసుకుంది. ఘటనతో తీవ్ర మనోవేదనకు లోనైన భర్త గంటల వ్యవధిలోనే ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు... శెట్టూరు మండలం కైరేవు గ్రామానికి చెందిన కురుబ ఓంకారమ్మ (40), మల్లికార్జున దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఓంకారమ్మకు పలు ఆస్పత్రుల్లో కుటుంబసభ్యులు చికిత్స చేయించారు. జబ్బు నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యులు తిరిగి వచ్చి చూసేసరికి ఆమె మృతి చెందింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ యువరాజ్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, భార్య మృతిని జీర్ణించుకోలేక గురువారం సాయంత్రం భర్త మల్లికార్జున క్రిమి సంహారక మందు తాగాడు. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెనువెంటనే కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.


ఓంకారమ్మ (ఫైల్)

మరణంలోనూ వీడని బంధం

- రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి
- పండుగ పూట విషాదం


రామచంద్ర, ముత్యాలక్క (ఫైల్)


నుజ్జునుజ్జైన ద్విచక్ర వాహనం

ఆత్మకూరు: కడవరకూ భార్యభర్తల అనుబంధానికి నిదర్శనంగా బతికిన ఆ దంపతులు మరణంలోనూ ఒకరిని వీడి మరొకరు ఉండలేకపోయారు. పండుగ పూట ఈ విషాదం చోటు చేసుకోవడంతో ఆత్మకూరు వాసులు ఉలిక్కిపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... రాప్తాడు నియోజకవర్గం ఆత్మకూరుకు చెందిన బోయ రామచంద్ర (58), ముత్యాలక్క (55) దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఆర్టీటీలో డ్రైవర్‌గా రామచంద్ర పనిచేస్తున్నాడు. పూల వ్యాపారం సాగిస్తూ కుటుంబానికి చేదోడుగా ముత్యాలక్క నిలిచింది. ఈ క్రమంలోనే పిల్లలను పెంచి పెద్ద చేసి, పెళ్లిళ్లు చేశారు. ఎప్పటిలానే దంపతులిద్దరూ గురువారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై అనంతపురానికి బయలుదేరారు. వడ్డుపల్లి వద్దకు చేరుకోగానే అనంతపురం నుంచి మడకశిర వైపుగా వెళుతున్న బొలెరో వాహనాన్ని డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ రాంగ్‌రూట్‌లో నేరుగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. ఘటనతో రామచంద్ర, ముత్యాలక్క రోడ్డు పక్కన ఉన్న చెత్త దిబ్బల్లోకి ఎగిరి పడ్డారు. తీవ్రంగా గాయపడిన వారు అక్కడికక్కడే మృతి చెందారు. ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న అనంతరం బొలెరో సైతం బోల్తాపడింది. ఆ సమయంలో పెద్ద శబ్దం కావడంతో స్థానికులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. ప్రమాదానికి కారణమైన బొలెరో డ్రైవర్ సురక్షితంగా బయటపడి అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

దళితుడిపై దాడి కేసులో డీఎస్పీ విచారణ


నోటీసులు అందుకుంటున్న ఉన్నం మారుతీచౌదరి

శెట్టూరు: మండలంలోని లక్ష్మంపల్లికి చెందిన వడ్డే శారదమ్మపై అసభ్యంగా ప్రవర్తిస్తుండగా అడ్డుకోబోయిన దళితుడు విరుపాక్షిపై టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఉన్న హనుమంతరాయ చౌదరి కుమారులు మారుతీచౌదరి, భాస్కర్‌చౌదరి, వారి అనుచరులు దాడి చేసిన విషయం తెలిసేందే. దీనిపై నిందితులను గురువారం శెట్టూరు పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ బి. శ్రీనివాసులు విచారణ చేశారు. నిందితులు మంగళవారం రాత్రి లక్ష్మంపల్లిలో దాడికి వెళ్లిన సమయంలో ఉపయోగించిన రెండు ఇన్నోవా కార్లు, మరో రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఉన్నం మారుతీచౌదరి, ఉన్నం భాస్కరచౌదరి, గోళ్ల వెంకటేశులు, కొల్లి సత్యనారాయణ, కరిడిపల్లి రంగప్ప, కైరేవు తిమ్మరాజు, దాసరి గోపీనాథ్, మాగం వీరన్న, రాయపాటి ఆంజనేయులు, గొల్ల రవి, ఉనుగూరు వెంకటేశులు, హెచ్‌డీ కొళ్లాపురప్పపై కేసు నమోదు చేశారు. వీరిలో ఇద్దరి మినహా మిగిలిన పదిమందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదైంది.

తొలి ప్రయత్నం 'కేక'


రాతి దూలాన్ని లాగుతున్న ఒంటెద్దు

ఆత్మకూరు: రెండు ఎద్దులు అతి కష్టంపై లాగే రాతిదూలాన్ని ఒంటెద్దు లాగడమంటే ఆషామాషీ కాదు. శ్రీరామనవమిని పురస్కరించుకుని ఈ అరుదైన విన్యాసాన్ని ఆత్మకూరు రైతు గుమ్మడి ఈశ్వర రెడ్డి ప్రదర్శించి అబ్బురపరిచారు. 17 అడుగుల పొడవు, 16 ఇంచుల ఎత్తు, అదే పరిమాణం వెడల్పు ఉన్న రాతిదూలానికి తాను పెంచుకుంటున్న జెర్సీ ఎద్దును కట్టి లాగించాడు. తొలి ప్రయత్నంలోనే 150 మీటర్లకు పైగా దూరం రాతి దూలాన్ని ఎద్దు సునాయాశంగా లాగడంతో గ్రామస్తులు దానికి బ్రహ్మరథం పట్టారు.

నీటితొట్టెలో పడి బాలుడి మృతి


బాలుడి మృతదేహం

వజ్రకరూరు: నీటితొట్టెలో పడి బాలుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని వెంకటాంపల్లి చిన్నతండాలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కుమార్‌నాయక్, లక్ష్మీదేవి దంపతులకు ముగ్గురు కుమారులు. చిన్న కుమారుడు అకిరా నందన్‌నాయక్ (18 నెలలు) గురువారం ఆడుకుంటూ ఇంటి ఆవరణలో ఉన్న నీటి తొట్టెలో పడిపోయాడు. చుట్టుపక్కలంతా వెతికిన తల్లిదండ్రులు చివరకు నీటి తొట్టెలో పడి ఉండటాన్ని గుర్తించారు. వెంటనే బయటకు తీసి ఉరవకొండ ప్రభుత్వాపత్రికి తీసుకురాగా.. పరిశీలించిన వైద్యులు అకిరా నందన్‌నాయక్ మరణించినట్లు నిర్ధారించారు. బాలుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

హోరాహోరీగా వృషభాల బలప్రదర్శన

రాప్తాడు: లక్ష్మీ పండమేటి రాయుడి బ్రహ్మోత్సవాలు, శ్రీరామనవమిని పురస్కరించుకుని రాప్తాడులోని శ్రీవారి ఆలయం వద్ద గురువారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి రాతిదూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన 10 జతల వృషభాలను రైతులు తీసుకువచ్చారు. ఒక్కో జతకు 20 నిమిషాల సమయం కేటాయించారు. పోటీల్లో ఉరవకొండకు చెందిన రైతు నిస్సార్ వృషభాలు ప్రథమ స్థానంలో నిలిచాయి. అలాగే ద్వితీయ, తృతీయ స్థానాలను గార్లదిన్నెకు చెందిన రైతులు లక్ష్మీరెడ్డి, రామాంజినేయులు వృషభాలు, నాల్గో స్థానంలో కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం పీఆర్ పల్లి రైతు సుధాకర్ యాదవ్ వృషభాలు, ఐదో స్థానంలో గుంతకల్లు మండలం నాగసముద్రం గ్రామానికి చెందిన రైతు జయరామిరెడ్డి వృషభాలు నిలిచాయి. ఈ సందర్భంగా విజేత వృషభాల యజమానులను అభినందిస్తూ నగదు పురస్కారాలతో వైఎస్సార్‌సీపీ నాయకులు తోపుదుర్తి రాజశేఖరరెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, ఆలయ కమిటీ అధ్యక్షుడు గంజి రాముడు, వైఎస్సార్‌సీపీ యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


బహుమతులు పంపిణీ చేస్తున్న తోపుదుర్తి రాజశేఖరరెడ్డి

క్లుప్తంగా

నేడు 'వైఎస్సార్ ఆసరా' చెక్కు పంపిణీ

రాప్తాడు: రాప్తాడులోని జాకీ కంపెనీకి కేటాయించిన భూమిలో శుక్రవారం 'వైఎస్సార్ ఆసారా' మూడో విడత మెగా చెక్కు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి లబ్ధిదారులు, మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

చలివేంద్రం ప్రారంభం



బళ్లారి బైపాస్ రోడ్డు వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించిన డిప్యూటీ మేయర్ కోగటం

అనంతపురం క్రైం: నగరంలోని బళ్లారి బైపాస్ హైవే బ్రిడ్జ్ వద్ద సత్యసాయి రోడ్ లైన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సేవా దృక్పథంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు రాతిదూలం లాగుడు పోటీలు

ఆత్మకూరు: వడ్డుపల్లి గ్రామంలో శుక్రవారం రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సీనియర్ విభాగంలో పోటీలు ఉంటాయన్నారు. మొదటి బహుమతిరూ.40 వేలు, రెండో బహుమతి రూ. 30 వేలు, మూడో బహుమతి రూ.20 వేలు, నాల్గో బహుమతి రూ.10 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

రేపు సింగమనేని సాహితీ సదస్సు

అనంతపురం కల్చరల్: నగరంలోని నాల్గోరోడ్డులోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాఠశాలలో దివంగత రచయిత సింగమనేని నారాయణ ద్వితీయ వర్ధంతి సందర్భంగా గుర్రం జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు సాహితీ సదస్సు నిర్వహించనున్నారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, సాహితీ,విద్యావేత్తలు పాల్గొంటారన్నారు.

'ప్యారే మోహన్' పోస్టర్ విడుదల

అనంతపురం క్రైం:ఆదర్శనగర్‌లో ప్యారే మోహన్ చిత్రం టైటిల్ పోస్టర్‌ను 32వ డివిజన్ కార్పొరేటర్ కమల్‌భూషణ్ గురువారం ఆవిష్కరించారు. యువత సందేశాత్మక చిత్రాలను తీయాలని ఆయన కోరారు. డైరెక్టర్ స్వరూప్, హీరో గౌతమ్, ప్రొడ్యూసర్ సాయిప్రసాద్, నటీనటులు శశి, చరణ్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

రాత్రి 11.30 వరకు పన్ను చెల్లింపునకు అవకాశం



నగరపాలక సంస్థలో పన్ను చెల్లింపు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ రమణారెడ్డి

అనంతపురం క్రైం: వడ్డీమాఫీకి నేటితో గడువు ముగియనుండడంతో రాత్రి 11.30 గంటల వరకు పన్ను చెల్లింపునకు అవకాశం కల్పించినట్లు కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. నగరంలోని నగరపాలక సంస్థ కార్యాలయం, 17, 41, 54, 64 సచి వాలయాల పరిధిలో మొత్తం రూ.1.30 కోట్ల పన్ను వసూలైంది. ఈ నాలుగు సచివాలయాల పరిధిలో రాత్రి 8 గంటల వరకు కౌంటర్లు పనిచేస్తాయి. గురువారం నగరపాకల సంస్థ కమిషనర్ రమణారెడ్డి పర్యవేక్షణలో ఆర్ఓలు సతీష్, సుజాత, ఆర్ఐలు మురళీ, వేణు, బాబు, పద్మావతి, సచివాలయ సిబ్బంది బకాయిదారుల ఇళ్లకు వెళ్లి పన్ను చెల్లించాలని కోరారు. అనంతరం కమిషనర్ రమణారెడ్డి పలు సచివాలయాలను తనిఖీ చేశారు. నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని, తాగునీరు అందేలా చూడాలని డీఈ నరసింహను ఆదేశించారు. తద్వారా హమాలీకాలనీ, రాంనగర్, సంఘమిత్ర కాలనీ, శారదానగర్, బుడ్డప్పనగర్ తదితర ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీరు అందించారు. శుక్రవారం నుంచి పూర్తి స్థాయిలో నీరు సరఫరా అవుతుందని కమిషనర్ తెలిపారు.

సీతారామ కల్యాణ వైభోగం

- అనంతలో ఒంటిమిట్ట తలంబ్రాలతో కల్యాణం
- ఊరూవాడా శ్రీరామనవమి వేడుకలు
- ఉత్సాహంగా ఉట్ల పరుషలు



ఐదోరోడ్డులో రామాలయం వద్ద ఉట్లమానుకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం



రాప్తాడు: రాప్తాడులో సీతారాముల విగ్రహాలపై అక్షింతలు వేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం కల్చరల్/అనంతపురం శ్రీకంఠంసర్కిల్/ రాప్తాడు/ఆత్మకూరు: కాశీవిశ్వేశ్వర కోదండరామాలయంలో పదిరోజుల పాటు సాగే బ్రహ్మోత్సవ వేడుకలను ఆలయ ఈఓ సుధారాణి నేతృత్వంలో ధ్వజారోహణంతో ప్రారంభించారు. సోమ నాథనగర్, నాల్గోరోడ్డు, రెవెన్యూ కాలనీ, మారుతీనగర్, రెవెన్యూకాలనీ, పాతూరు ప్రాచీన దేవస్థానం తదితర చోట్ల కొలువైన శ్రీరాముడి ఆలయాలు, హౌసింగ్ బోర్డు అభయాంజనేయస్వామి ఆలయం, శ్రీనివాసనగర్, గీతామందిర్, తపోవనం శ్రీశివశక్తి బాబా మందిరం కోర్టురోడ్డు వరదాంజనేయస్వామి ఆలయాల్లో సీతారాముల కల్యాణోత్సవాలు కమనీయంగా జరిగాయి. పలుచోట్ల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. నగరంలోని ఐదోరోడ్డు, సున్నపుగేరి తదితర చోట్ల ఉట్ల పరుషలు గురువారం సాయంత్రం ఉత్సాహంగా జరిగాయి. ఉట్టిమాను ఎక్కేందుకు యువకులు పోటీపడ్డారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కనుల పండువగా కల్యాణోత్సవం

రాప్తాడు మండలంలోని పలు గ్రామాల్లో సీతారాముల కల్యాణోత్సవం కనులపండువగా సాగింది. రాప్తాడులో లక్ష్మీ పండమేటి రాయుడు (వెంకటేశ్వరస్వామి) బ్రహ్మోత్సవాల సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవం జరిపించారు. వేడుకలకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఆయన సోదరుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి, ఆయన సతీమణి తోపుదుర్తి నయనతా రెడ్డి హాజరయ్యారు. హంపాపురం సమీపంలోని మౌనగిరిక్షేత్రంలో వెలసిన 39 అడుగుల ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు జరిగాయి. మండలంలో భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి కల్యాణమూర్తులు సీతారాములును భక్తిశ్రద్ధలతో ఊరేగించారు.

మార్మోగిన శ్రీరామ నామస్మరణ

ఆత్మకూరు మండల వ్యాప్తంగా గురువారం అన్ని గ్రామాల్లో శ్రీరామ నామ స్మరణ మార్మోగింది. ఆత్మకూరు, వడ్డుపల్లి, మదిగుబ్బ, పి.యాలేరు, సనప గ్రామాల్లో పండుగ పెద్ద ఎత్తున నిర్వహించారు. శ్రీరాముడు, సీత, లక్ష్మణ, ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలకు పట్టు వస్త్రాలు ధరింపజేసి, బంగారు ఆభరణాలతో అలంకరించారు. ఆలయాల వద్ద తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు. సనపలో గురువారం సాయంత్రం పెద్ద ఎత్తున రథోత్సవం నిర్వహించారు. ఏటా శ్రీరామనవమి పండుగ సందర్భంగా శ్రీరాముడు, సీత, లక్ష్మణ, ఆంజనేయ ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి, కల్యాణోత్సవం జరిపించారు.

కనగానపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సీతారాముల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. మామిళ్లపల్లిలోని సీతారాముల ఆలయంలో నాగయ్య శెట్టి, కొండారెడ్డి కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలతో కలసి రాముల వారి కల్యాణోత్సవం జరిపించారు. తగరకుంట, పాతపాళ్యం గ్రామాల్లోని రామాలయాల్లో స్థానిక గ్రామస్తులు, భక్తుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

చెన్నేకొత్తపల్లి : మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో శ్రీరామనవమి పండగను జరుపుకున్నారు. న్యామద్దల, వెంకటంపల్లి, చెన్నేకొత్తపల్లి, మేడాపురం, ప్యాదిండి, ఓబుళంపల్లి, కనుముక్కల, బసంపల్లి, బోగసముద్రం, గంగినేపల్లి, వెల్దుర్తి, బసినేపల్లి గ్రామాల్లోని రామాలయాల్లో కల్యాణోత్సవం జరిపించారు.

పోలీసు క్వార్టర్స్‌లో శ్రీరామనవమి వేడుకలు

- పట్టు వస్త్రాలు సమర్పించిన ఎస్పీ ఫక్కీరప్ప దంపతులు



కల్యాణోత్సవం జరిపిస్తున్న ఎస్పీ ఫక్కీరప్ప దంపతులు

జిల్లా కేంద్రంలోని పోలీసు క్వాటర్స్ ఆవరణలోని కోదండరామాలయంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం ఎస్పీ డాక్టర్ కె.ఫక్కీరప్ప దంపతులు ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరై స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. సీతారాముల కల్యాణాన్ని ఎస్పీ దంపతుల ఆధ్వర్యంలో వేదపండితులు జరిపించారు. జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఎస్పీ కోరుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు నాగేంద్రుడు, ఏ హనుమంతు (ఏఆర్)ల దంపతులు, ఎస్బీ సీఐ చక్రవర్తి, డీసీఆర్బీ సీఐ విశ్వనాథ్ చౌదరి, టెక్నికల్ ఎస్ఐ సుధాకర్ యాదవ్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్ , సుధాకర్ రెడ్డి, తేజ్‌పాల్, సరోజ, రామాలయం కమిటీ సభ్యులు గాండ్ల హరినాథ్ , నాగరాజు, లింగమయ్య, ఆర్ఎస్ఐలు రాజశేఖర్ రెడ్డి, భాస్కర్, ప్రవీణ్ కుమార్, రమేష్ నాయక్, రిటైర్డ్ పోలీసు అధికారులు, పోలీసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో ప్రత్యేక అలంకరణలో సీతారామ, లక్ష్మణ ఆంజనేయుడి విగ్రహాలు



మదిగుబ్బలో ప్రత్యేక అలంకరణలో ఉత్సవ విగ్రహాలు



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



ఐదోరోడ్డులో ఉట్లమాను ఎక్కుతున్న యువకులు



మొదటిరోడ్డు కోదండరామాలయంలో పూజలందుకున్న సీతారాములు



కనగానపల్లి: మామిళ్లపల్లిలో సీతారాముల కల్యాణోత్సవాన్ని జరిపిస్తున్న దృశ్యం



రామాలయంలోని సీతారాముల కల్యాణోత్సవం జరిపిస్తున్న అర్చకులు



లక్ష్మీనగర్‌లోని రామాలయంలో స్వామి



రాప్తాడు: సీతారాములు మెడలో పూలహారం వేస్తున్న తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి, నయనతారెడ్డి



బైపాస్ రోడ్డులో పూజలందుకున్న హనుమంతుడు



గుత్తిరోడ్డులో జరిగిన వేడుకల్లో పాల్గొన్న జెడ్పీ చైర్పర్సన్ బోయగిరిజమ్మ



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో శ్రీరామ శోభాయాత్ర



సందడిగా సాగుతున్న ర్యాలీ



మాట్లాడుతున్న వీహెచ్‌పీ నాయకులు

అనంతపురం కల్చరల్: శ్రీరామ నవమి, అయోధ్య రామాలయం సుందరంగా నిర్మితమవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని నగరంలో పెద్ద ఎత్తున శ్రీరామ శోభాయాత్ర వైభవంగా జరిగింది. గురువారం స్థానిక ఎస్ఎస్‌బీఎన్ కళాశాల వద్ద ప్రత్యేక పూజల అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. కాలేజ్ వద్ద నుంచి సప్తగిరి సర్కిల్, టవర్‌క్లాక్, శ్రీకంఠం సర్కిల్, పాతూరు, బసవన్నకట్ట, అశోక్‌నగర్ మీదుగా హౌసింగ్‌బోర్డు అభ్యయాంజనేయస్వామి ఆలయం వరకు యువతీవయకులు ర్యాలీ చేశారు. మహిళలు ఝాన్సీ వేషధారణలతో శ్రీరామనామస్మరణ చేశారు. శోభాయాత్రలో పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

శ్రీరాముడి జీవితమే ఆదర్శం :

శ్రీరాముడి జీవితాన్ని మనమందరం స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రధానవక్త అఖిలభారత కార్య జాగరణ ప్రముఖ్ ఆలె శ్యామకుమార్ పేర్కొన్నారు. రామాయణం ప్రపంచానికి గొప్ప ధర్మాన్ని అందించిన మహాకావ్యమన్నారు. దేశానికే తలమానికంగా నిలిచే అయోధ్య రామాలయ నిర్మాణంతో దేశ ధార్మిక సౌభాగ్యం మరింత సుసంపన్నమవుతోందన్నారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, శ్రీపాద వేణు, సందరెడ్డి శ్రీనివాసరెడ్డి, లింగారెడ్డి, స్వామి ఆత్మవిదానంద సరస్వతి, పుట్లూరు సుదర్శనరెడ్డి, చార్లెస్ చిరంజీవిరెడ్డి, భవానీ రవి కుమార్, హర్ష, తోట సూర్యప్రకాష్, వివేకానంద యోగకేంద్ర ప్రతినిధులు రాజశేఖరరెడ్డి, కృష్ణవేణి తదితరులు శోభాయాత్రను ముందుకు నడిపించారు.

థియేటర్లలో ఆటోలకు పార్కింగ్ ఉండాలి



ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: థియేటర్లలో ఆటోలకు పార్కింగ్ స్థలం కేటాయించాలంటూ అనంతపురంలోని 'ఎస్ మాక్స్' థియేటర్ ఎదుట సీఐటీయూ అనుబంధ భగత్‌సింగ్ ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం 1వ నగర కార్యదర్శి రామిరెడ్డి, సీఐటీయూ నగర కార్యదర్శి వెంకటనారాయణ మాట్లాడారు. థియేటర్లలో గతంలో ఆటోలకు పార్కింగ్‌కు అనుమతిచ్చేవారని, అయితే పది రోజులుగా అనుమతి లేదంటూ బోర్డు ఏర్పాటు చేశారన్నారు. థియేటర్లలో పార్కింగ్ స్థలం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఈ నెల 27న స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా అధికారులు ఆదేశించారన్నారు. అయినా థియేటర్ల యాజమాన్యం వైఖరి మార్చుకోలేదన్నారు. పార్కింగ్ స్థలం కేటాయించకపోతే అన్ని థియేటర్ల ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు ఆజాం, నాగరాజు, ఆదినారాయణ, సోమప్ప, చంద్రశేఖర్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అనంతకు చేరిన సైకిల్‌యాత్ర



చరణ్‌ప్రసాద్

అనంతపురం కల్చరల్: మహిళలపై వేధింపుల కేసుల్లో నిందితులను కఠినంగా శిక్షించాలన్న డిమాండ్‌తో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి చరణ్ ప్రసాద్ చేపట్టిన సైకిల్ యాత్ర గురువారం సాయంత్రం అనంతపురానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నపిల్లలు, మహిళలపై వేధింపులు, అత్యాచారాలను నిరసిస్తూ ఈ నెల 25న ఉస్మానియా వర్సిటీ నుంచి సైకిల్ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఏప్రిల్ 10న కన్యాకుమారికి చేరుకోవడంతో యాత్ర ముగుస్తుందన్నారు. ఈ క్రమంలో మార్గమధ్యంలోని గ్రామాలు, విద్యా సంస్థల్లో యువత, తల్లిదండ్రులతో సమావేశమై వేధింపులు, అత్యాచారాల నిరోధానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చైతన్య పరుస్తున్నట్లు వివరించారు. పౌరులుగా అందరూ విచక్షణతో, వివేకంతో మెలగాల్సిన బాధ్యతను గుర్తు చేయడమే సైకిల్‌యాత్ర లక్ష్యమని పేర్కొన్నారు. దీనికి తోడు అత్యాచారాల నిరోధానికి కఠినమైన చట్టాలను తేవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరనున్నట్లు తెలిపారు.

వైభవంగా పండమేటి రాయుడి బ్రహ్మోత్సవాలు

రాప్తాడు: మండల కేంద్రంలో లక్ష్మీ పండమేటి రాయుడు (వేంకటేశ్వర స్వామి) బ్రహోత్సవాలు గురువారంతో వైభవంగా ముగిశాయి. తెల్లవారుజామున శ్రీదేవి, భూదేవి సమేతుడైన పండమేటి రాయుడికు ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మోత్సవాలు తిలకించడానికి కనగానపల్లి, ఆత్మకూరు, అనంతపురం, ధర్మవరం తదితర మండలాల నుంచే కాక జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చారు. ముందుగా ఆలయ కోనేటిలో స్వామికి చక్రస్నానం చేయించారు.

ఉత్సాహంగా ఉట్ల పరుష : ఆలయం వద్ద గురువారం సాయంత్రం ఉట్ల పరుష ఉత్సాహంగా జరిగింది. బోయ కులస్తులు శ్రీరాముడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి గ్రామ వీధుల్లో ర్యాలీగా ఆలయం వద్దకు చేరుకున్నారు. కోనేటిలో చక్రస్నానం తర్వాత పండమేటి రాయుడిని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉట్లమాను కొట్టారు. నార్పల మండలం బండ్లపల్లికి చెందిన స్వామి కాపులు, ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. స్వామిని అధికారులు, ప్రజాప్రతినిధులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఎస్ఐ పీవై ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి



ఉట్ల పరుషకు హాజరైన భక్తులు

వాహన సేవలను ప్రారంభించిన ఎమ్మెల్యే



ప్రత్యేక పూజల్లో పాల్గొని, రథాన్ని లాగుతున్న ఎమ్మెల్యే

అనంతపురం కల్చరల్: శ్రీరామనవమి ఉత్సవ సంబరాలు రాత్రి వరకు భక్తిశ్రద్ధలతో జరిగాయి. గురువారం రాత్రి స్థానిక మొదటిరోడ్డు శివాలయలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆత్మీయ అతిథిగా పాల్గొన్నారు. అనంతరం సాగిన రథోత్సవ సేవల్లో వాహనసేవలను లాంఛనంగా ప్రారంభించారు. పదిరోజుల పాటు ఉత్సవాలు వైభవంగా సాగుతాయని ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు సురేష్, సుబ్రమణ్యం తెలిపారు. ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఆలయ అనువంశిక ధర్మకర్త హోసూరు రామసుబ్రమణ్యం, అర్చకులు సుబ్రమణ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామ నవమి వేడుకలు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో గురువారం శ్రీరామ నవమి పర్వదిన వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. గురువారం వేకువజామునే ఆలయంలో స్వామికి అభిషేకాలు నిర్వహించిన అర్చకులు అనంతరం స్వామిని ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.